కొత్త రేషన్‌కార్డులకు మోక్షం కలిగేనా?

- అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- అర్హులకు కార్డులు అందించాలన్న యోచనలో ప్రభుత్వం



రేషన్ కోసం క్యూలో నిల్చున్న లబ్ధిదారులు (ఫైల్)

సుల్తానాబాద్: దారిద్య్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. దీంతో ప్రజాపాలన దరఖాస్తులతో పాటు ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ సర్వేలో సైతం వివరాలు సేకరించింది. పాత రేషన్‌కార్డులు ఉన్న వారి వివరాలతో పాటు కొత్త రేషన్‌కార్డు కావాల్సిన వారు ఎందరు ఉన్నారనే అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 413 రేషన్ షాపులు ఉన్నాయి. అన్నపూర్ణ కార్డులు 175, రేషన్ కార్డులు 2,10,147, అంత్యోదయ కార్డులు 12,297 ఉన్నాయి. ఈ కార్డుల్లోని ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రతి నెలా సుమారు మొత్తం 3506 మెట్రిక్ టన్నుల పంపిణీ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

అర్హులకు కార్డు ఇచ్చే యోచనలో ప్రభుత్వం..

రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా 17వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉత్తర్వులు రాగానే అమలు చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే కొత్త రేషన్ కార్డుల వివరాలను అప్లోడ్ చేస్తాం. ప్రభుత్వం ఇంకా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు.

– రాజేందర్, డీఎస్‌వో, పెద్దపల్లి

ఘనంగా అయ్యప్ప అఖండ శరణుఘోష



ఫర్టిలైజర్‌సిటీ: అయ్యప్ప ఆలయంలో..



జ్యోతినగర్: అఖండ శరణుఘోషలో స్వాములు

ఫర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం, అఖండ శరణు ఘోష, పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. అఖండ శరణు ఘోష 24 గంటల పాటు పారాయణం చేస్తారని తెలిపారు. ఆలయ ప్రధాన గురుస్వామి ఆడెపు లక్ష్మీనారాయణ, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

శ్రీహరిహర ఆలయంలో..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని హరిహర ఆలయంలో ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి అఖండ శరణు ఘోష కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ ప్రారంభించారు. అఖండ కర్పూర హారతితో పాటు స్వామివారికి పుష్పాభిషేకం, 12గంటల కర్పూర హారతి నీరాజనం చేశారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనగామ తిరుపతి, ప్రభాకర్ గురుస్వామి, భద్రయ్య, హనుమంతరావు, భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యవర్గ సభ్యులు చల్లా రవీందర్‌రెడ్డి, తుమ్మ సురేశ్‌కుమార్, శ్రీనివాస్ సమ్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌రావు, గిరి, రాము, భరత్ స్వామి, చంద్రశేఖర్ స్వామి, రమాకాంత్, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రమాదరహిత మాసోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న అధికారి వంశీకృష్ణ

మంథని: మంథని ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రమాదరహిత మాసోత్సవాలు ప్రారంభించారు. పెద్దపల్లి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మంథని డిపో జీరో యాక్సిడెంట్‌గా నమోదులో ఉందని, ఈ సందర్భంగా ఉద్యోగులను డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ అభినందించారు. ఎల్‌హెచ్ శ్రీనివాస్, ఆర్‌హెచ్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్‌డీఐ గోపాల్ తదితరులు ఉన్నారు.

నూతన సంవత్సరం వేడుకలు



సుల్తానాబాద్‌లో వేడుకలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, పల్ల సురేశ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బైరగోని రవీందర్‌గౌడ్, మంద శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్, ప్రవీణ్, రామచంద్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కరీంనగర్‌కు చెందిన ఫిరోజ్ ఆటోలో గోదావరిఖనికి వైపు వస్తుండగా అదేమార్గంలో వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటోలో ఉన్న ఫిరోజ్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ప్రమాద స్థలానికి చేరుకున్న 108 గాయాలైన ఫిరోజ్‌ను గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

• మతిస్థిమితం లేని మహిళలకు చేయూత

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఒంటిపై దుస్తులు లేకుండా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న మహిళను బుధవారం రాజేశ్వరీ సేవా ట్రస్ట్ చైర్మన్, అంబేడ్కర్ సేవారత్న అవార్డు గ్రహీత కత్తెరమల్ల రాజలింగం చేయూత అందించారు. ఈ సందర్భంగా సదరు మహిళకు స్థానిక మహిళల సహకారంతో స్నానం చేయించి చీర కట్టించి భోజనం పెట్టించారు. కాగా అదే గ్రామంలో ఉన్న మతిస్థిమితం కోల్పోయిన ఇద్దరు దళిత మహిళలకు సైతం రెండు జతల చీరలు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్‌తో పాటు గడదాసు వీరస్వామి, మిడివెల్లి శ్రీనివాస్, బైరం ప్రసాద్, సత్యం ఉన్నారు.

• యువతి అదృశ్యం

జ్యోతినగర్: యువతి అదృశ్యమైన సంఘటన ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి అన్నపూర్ణకాలనీకి చెందిన జె.మాలతి(20) ఇంటి వద్దే ఉంటోంది. గత నెల 30న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. మాలతి తండ్రి చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

• షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీలోని రెయిన్‌బో పాఠశాల సమీపంలోని మందాల సత్యనారాయణ ఇంట్లో అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. గుడ్ల శ్రీధర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో గోదావరిఖని ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని వెంటనే మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50వేల విలువ గల ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు.

• నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామంలో పురగిరి క్షత్రియ పెరికసంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం పెరిక సంఘం రాష్ట్ర నాయకురాలు కందుల సంధ్యారాణి ఆవిష్కరించారు. గ్రామంలోని పెరికసంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కులస్తులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

• మున్నూరుకాపు క్యాలెండర్..

ఓదెల: ఓదెల గ్రామంలో మున్నూరుకాపు సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, సంఘం నాయకులు పుప్పాల దేవేందర్, రాపల్లి రాజయ్య, వెంకటేశ్, శంకర్, తిరుపతి, పెద్దమల్లయ్య, తోట అన్వేష్, శంకర్, కృష్ణ, రాజయ్య, రాజేందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

• పెంచిన కూలీరేట్లు అమలు చేయాలి

సుల్తానాబాద్: సివిల్ సప్లై హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే అమలు చేయాలని సుల్తానాబాద్‌లోని గోదాం ఎదుట హమాలీ కార్మికులు బుధవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల నాయకులు మైలారం తిరుపతి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం ఇచ్చిన జీవోను అమలు చేయకుండా నాన్చివేత ధోరణి అవలంభిస్తోందని ఆరోపించారు. పెంచిన కూలీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. కార్మికులకు అందే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

• అయ్యప్పస్వాములకు భిక్ష

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ అయ్యప్ప స్వామి దీక్షాపరులకు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందునూరి పెద్దన్న, వ్యాపారి అశోక్‌రావు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి దీక్షాపరులకు చివరి రోజు కావడంతో బుధవారం భిక్ష స్వయంగా వడ్డించారు. గురుస్వాములు సాయిరి మహేందర్, మిట్టపల్లి మురళిని సన్మానించారు. పూజారి రమేశ్‌శర్మ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, మాజీ జెడ్పీటీసీ రమేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా యాజమాన్యం ముందుకు సాగుతోందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభావిత, నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. డిసెంబర్‌లో 10.81లక్షల టన్నుల లక్ష్యానికి గాను 8.74లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల్లో 81శాతం సాధించినట్లు పేర్కొన్నారు. ఓబీ వెలికితీతతో 62లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 52.16 క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీసి నిర్దేశిత లక్ష్యాల్లో 84శాతానికి చేరుకున్నట్లు వెల్లడించారు. అలాగే సీహెచ్‌పీ నుంచి 7.16లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగినట్లు వివరించారు. సమావేశంలో అధికారులు నర్సింహారావు, రాముడు, నెహ్రూ, అనిల్‌కుమార్, ఎర్రన్న, మురళీకృష్ణ, డాక్టర్ మహిపాల్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రథయాత్ర



మాట్లాడుతున్న రామంచ భరత్

కాల్వశ్రీరాంపూర్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు జనవరి 7 నుంచి ఫిబ్రవరి 7వరకు రథయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు రామంచ భరత్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఒక్కరే వ్యతిరేకిస్తున్నారు..

ఎస్సీలలో వర్గీకరణ కోసం అందరూ ఆమోదం తెలిపారని, 59 ఉపకులాల్లో కేవలం ఒక్క కులం వారే వ్యతిరేకంగా ఉన్నారన్నారు. ఇన్నిరోజులు రాజకీయ నాయకుల ప్రచారానికి డప్పులు కొట్టామని, మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ కోసం లక్ష డప్పులు కొట్టేందుకు ఉద్యమ స్ఫూర్తితో డప్పు కళాకారులు సిద్ధమవుతున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఎమ్మెస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, కళాకారులు, నాయకులు తూండ్ల రాజయ్య, బర్ల తిరుపతి, పాల రాజేశం, శంకర్, దంతెనపెల్లి ధర్మయ్య, అంబాల సతీశ్, సాగర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు

పెద్దపల్లిరూరల్: ఎస్సీ వర్గీకరణకు బీసీ నిరుద్యోగ కళాకారుల సంఘం మద్దతు ఇస్తోందని నాయకులు కిరణ్ అన్నారు. హైదరాబాద్‌లో 27న ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ తలపెట్టిన వెయ్యి గొంతులు..లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప రథయాత్ర



ఊరేగింపులో స్వాములు, కోలాట మహిళలు

రామగుండం: పట్టణంలోని అయ్యప్ప రథయాత్ర బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. కాలనీల మీదుగా రథయాత్ర కొనసగగా మహిళలు మంగళహారతులతో అయ్యప్ప రథయాత్ర వద్ద కొబ్బరికాయలు కొట్టారు. గురుస్వాములు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందించారు. వేడుకలను గురుస్వాములు గోపగోని రాములుగౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు కోలహలం శ్రీనివాస్‌రావు, తాటిపెల్లి శివప్రసాద్, జాగటి శ్రీకాంత్, ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖరశర్మ, మేడి తిరుపతి ఉన్నారు.

క్లుప్తంగా

మహిళల భద్రత కోసమే షీటీంలు



మాట్లాడుతున్న మల్లయ్య

జ్యోతినగర్: మహిళల భద్రత కోసం పోలీసుల ఆధ్వర్యంలో షీటీంలు విధులు నిర్వహిస్తున్నాయని షీటీం ఇన్‌చార్జి మల్లయ్య అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద కాంట్రాక్టు కార్మికులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ప్రతీరోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాతో పాటు జన సమీకరణ ప్రాంతాల్లో, కాలేజీల వద్ద షీటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. వేధింపులకు గురైన మహిళలు, విద్యార్థులు 63039 23700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలియజేయాలని కోరారు. షీటీం సభ్యులు స్నేహలత, సురేశ్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ రాజలింగం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లిలో పలు అభివృద్ధి పనులకు వివిధ కేటగిరీల కింద నిధులు మంజూరయ్యాయి. కాగా బుధవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం సీసీరోడ్డుకు ఉపాధిహామీ నిధులు రూ.50లక్షలు, శ్మశాన వాటిక సీసీరోడ్డు నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు రూ.15లక్షలు, గొల్లవాడ డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.60లక్షలు, వాటర్ ట్యాంక్ నుంచి ఎస్సీ కాలనీ వరకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.7.50 లక్షలు మంజూరు కాగా పనులు చివరి దశకు వచ్చాయి. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ గాదె సుధాకర్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, శ్రీనివాస్ ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. షుగర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్లబ్ ఆధ్వర్యంలో నిత్యం ఉచిత పరీక్షలు చేపడుతున్నామని పేర్కొన్నారు. షుగర్‌తో కలిగే అనర్థాలు, వ్యాధి నియంత్రణలో ఉంచేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. కార్యదర్శి రాంకిషన్, కోశాధికారి సత్యనారాయణ, మట్ట రాంరెడ్డి, దుబాసి కుమార్ ఉన్నారు.

మార్నింగ్ వాకర్స్ వార్షిక వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మార్నింగ్ వాకర్స్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటకు చెందిన మార్నింగ్ వాకర్స్ బృందం సభ్యులు జనవరి 1వ తేదీకి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. వాకింగ్‌తో కలిగే ప్రయోజనాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరిని వాకింగ్ చేసే దిశగా ప్రోత్సహించి ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కొలిపాక మధుకర్‌రెడ్డి, గంగారపు శ్రీనివాస్‌గౌడ్, కోల నారాయణ, నేరెళ్ల సత్యంగౌడ్, తమ్మనవేని చందుయాదవ్, మహిపాల్, తిరుపతిగౌడ్, మనోహర్‌రెడ్డి, వెంకటేశ్, అరవింద్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలు

గోదావరిఖనిటౌన్: నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం స్థానిక పవర్‌హౌస్‌కాలనీలోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వొజ్జల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఓదెల మల్లన్న సన్నిధిలో ఏసీపీ పూజలు

ఓదెల: నూతన సంవత్సరం సందర్భంగా ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ సిబ్బంది ఏసీపీకి మల్లికార్జునస్వామి చిత్రపటం అందించి సన్మానం చేశారు.

సింగరేణి వార్తలు

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది



పదోన్నతి పత్రాలు అందిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: పదోన్నతితో బాధ్యత పెరుగుతుందని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. ఆర్జీ–1 ఏరియాలోని అన్ని గనుల్లో సర్వీస్ లింక్ ప్రమోషన్ (ఎస్‌ఎల్‌పీ) పత్రాలను బుధవారం జీఎం చేతుల మీదుగా ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ యాజమాన్యం పరంగా రావాల్సిన పదోన్నతులు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాజీలేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. ఏరియాలోని జీడీకే 1, 3 గనిలో 29 మందికి, జీడీకే–2,2ఏ గనిపై 56మందికి, జీడీకే 11గనిపై 54 మందికి, జీడీకే–5 ఓసీలో 17 మందికి, ఏరియా వర్క్‌షాప్‌లో 17 మందికి, పలు డిపార్ట్‌మెంట్లలో 11మందికి ఇలా ఏరియాలో 182 మందికి పదోన్నతి ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోషం, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, అధికారులు వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్, చిలక శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

గోదావరిఖని: అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించి సింగరేణి సంస్థలోనే ఏరియాను నంబర్‌వన్‌గా నిలపాలని, రాబోయే రోజుల్లో సంస్థ అభివృద్ధే లక్ష్యంగా అందరూ కష్టించి పనిచేయాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో నిర్దేశించిన లక్ష్యాల్లో 98శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 90శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. రాబోయే మూడు నెలలు సంస్థకు కీలకమన్నారు. సమష్టిగా ముందుకు సాగి సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధనలో ప్రతీఒక్కరు తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ఆరెల్లి పోశం, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, అధికారులు హన్మంతరావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషిచేస్తాం



మాట్లాడుతున్న ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు

రామగిరి: భవిష్యత్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సమష్టిగా కృషి చేస్తామని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్జీ–3లో డిసెంబర్‌లో 100శాతం, ఏపీఏలో 145శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎంలు తెలిపారు. స్థానిక రామగిరి అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్జీ–3లో నిర్దేశించిన 5.78 లక్షల టన్నులకు గాను 5.77లక్షల టన్నులు అనగా 100శాతం బొగ్గు ఉత్పత్తి, 87శాతం మట్టి తీయడం, 6.59 లక్షల టన్నుల బొగ్గురవాణా చేసినట్లు పేర్కొన్నారు. ఏపీఏ గనిలో డిసెంబర్‌లో నిర్దేశించిన 0.09 లక్షల టన్నులకు గాను 0.13 లక్షల టన్నులు అనగా 145శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 0.06 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగినట్లు వివరించారు. కార్మికులకు, ఉద్యోగులకు, పరిసర ప్రాంత ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా ఇంజనీర్లు వై.వి.శేఖర్‌బాబు, కె.యాదయ్య, ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకటరమణ, ఏరియా సేఫ్టీ అధికారి ఎం.రామ్మోహన్, ఐఈ డీజీఎం చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డీపీఎం సునీల్ ప్రసాద్, సీనియర్ పీవో రాజేశం పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. క్రమశిక్షణతో ముందుకు సాగి సెక్యూరిటీ సిబ్బంది ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద కోల్ ట్రాన్స్‌పోర్ట్, సీఎస్పీల వద్ద, ఓసీపీ వద్ద సెక్యూరిటీ అప్రమత్తంగా ఉండాలన్నారు. లేకపోతే దాని ప్రభావం ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాపై పడే అవకాశం ఉంటుందన్నారు. డ్యూటీ సమయాని కంటే ముందుగానే బయలుదేరి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఎస్‌ఎల్‌పీ పదోన్నతి పత్రాలు

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ఉద్యోగులకు సర్వీస్ లింక్ ప్రమోషన్ (ఎస్‌ఎల్‌పీ) పత్రాలను బుధవారం జీఎం వెంకటయ్య అందజేశారు. ఓసీపీ–3 కృషిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 56మంది ఉద్యోగులకు ఎస్‌ఎల్‌పీ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించి, భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ జీగురు రవీందర్, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఎస్‌వోటూ జీఏ రవీందర్, ఏరియా ఇంజినీర్ నరసింహారావ్, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలోని సీసీరోడ్డు మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. దారి వెంట వెళ్లే వాహనదారులతో పాటు ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా దారిపై నడుచుకుంటూ వెళ్లే చిన్నపిల్లలు గొయ్యిలో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఎలాంటి ప్రమాదం జరగకముందే దారిపై ఏర్పడిన గొయ్యిని పూడ్చివేయాలని ఎస్సీకాలనీ ప్రజలు కోరుతున్నారు.



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500